క్లుప్తంగా

కంటి చూపుపై జాగ్రత్తలు తీసుకోవాలి



ఏఆర్ రొప్పంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఏఆర్ రొప్పం గ్రామంలో శుక్రవారం నీలకంఠాపురం ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఆర్గనైజర్ శిల్పా ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులు, మహిళలకు కంటి పరీక్షలు నిర్వహించారు. 15 మందికి కంటి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. కంటి చూపుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. ఎవరూ కంటి చూపును నిర్లక్ష్యం చేయవద్దన్నారు.

లైన్‌మెన్ రామప్ప మృతి



రామప్ప (ఫైల్)

అమరాపురం: స్థానిక మేజర్ పంచాయతీలో లైన్‌మెన్‌గా విధులు నిర్వరిస్తున్న రామప్ప (56) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన అమరాపురం లైన్‌మెన్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్నాడు. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ డీఈ, ఏఈలు, సహచర ఉద్యోగులు రామప్ప భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ విశ్వేశ్వర తదితరులు రామప్ప భౌతికకాయం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మండల కేంద్రాలకు చేరుతున్న పాఠ్య పుస్తకాలు



ప్రత్యేక వాహనంలో మడకశిరకు చేరిన పాఠ్య పుస్తకాలు

మడకశిర: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలను అందించడానికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే మండల కేంద్రాలకు ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను సరఫరా చేసే ప్రక్రియను ప్రారంభించింది. వచ్చే నెలలో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ పాఠ్య పుస్తకాలను ఎమ్మార్సీలో భద్రపరుస్తున్నారు. తొలి విడతలో మడకశిర మండలానికి 16,499 పాఠ్య పుస్తకాలు సరఫరా అయ్యాయి. అలాగే అగళి మండలానికి 4,791 పాఠ్య పుస్తకాలు సరఫరా అయ్యాయి. మిగిలిన పాఠ్య పుస్తకాలు కూడా త్వరలోనే ఆయా మండల కేంద్రాలకు చేరుతాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

వ్యాధులపై అవగాహన కల్పించండి



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న డీపీఓ విజయ్‌కుమార్

గుడిబండ: మండల కేంద్రంలోని సచివాలయాన్ని శుక్రవారం డీపీఓ విజయ్‌కుమార్ సందర్శించారు. కార్యాలయాల్లో రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ లేకుండా చూసుకోవాలన్నారు. వర్షాలు పడుతుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజలకు వ్యాధులపై అవగహన కల్పించడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించాలన్నారు. అదేవిధంగా వందశాతం పన్నులు వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగరాజునాయక్, కార్యదర్శి ప్రకాష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి పసిబాల చిన్నమ్మ పరుష



పసిబాల చిన్నమ్మ మూల విరాట్ (ఫైల్)

నల్లమాడ: మండలంలోని తుమ్మలామల దుర్గంలో వెలసిన మహిమాన్వితురాలు పసిబాల చిన్నమ్మ స్వామి పరుష శనివారం నుంచి ప్రారంభం కానున్నట్లు వంకరకుంట గ్రామపెద్దలు తెలిపారు. తొలిరోజు శనివారం దాసంగాలు, పరుష ప్రారంభమవుతుందన్నారు. 30న గురువారం వంకరకుంట గ్రామం నుంచి మధ్యాహ్నం 12 గంటలకు ఊరేగింపుగా చిన్నమ్మ దేవత బత్తినిపల్లికి పయనమైపోవుటతో పరుష కార్యక్రమాలు ముగుస్తాయన్నారు.

విజ్ఞానం.. వినోదం

- గ్రంథాలయాల్లో కొనసాగుతున్న విజ్ఞాన శిబిరాలు
- సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు
- జూన్ 7 వరకూ తరగతుల నిర్వహణ

గుడిబండ/మడకశిరరూరల్: జిల్లా గ్రంథాలయం సంస్థ ఆధ్వర్యంలో ఏటా వేసవి సెలవుల్లో శిక్షణ శిబిరాలు నిర్వహించేవారు. కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో 2020–2021లో రెండేళ్ల పాటు రద్దు చేశారు. 2022 నుంచి యథావిధిగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 29వ తేదీ నుంచి నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. అయితే పెరిగిన ఉష్ణోగ్రతలు, ఎన్నికలు నేపథ్యంలో శిక్షణ తరగతులు వాయిదా వేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి శిక్షణ శిబిరాలు ప్రారంభించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయం వృథా కాకుండా వారిలో పఠనా శక్తిని కలిగించడం, గ్రంథాలయాలను సద్వినిమోగం చేసుకొనేలా ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులను ఆకట్టుకొనేలా వివిధ అంశాలపై 40 రోజులు శిక్షణ ఇస్తున్నారు. జూన్ 7వ తేదీ వరకూ శిక్షణ కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

ప్రముఖులతో అవగాహన సదస్సులు

గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లకు 15 సంవత్సరాల్లోపు పిల్లలు హాజరై వివిధ రకాల పుస్తకాలను చదువుతున్నారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకూ కథలు, ఆటలు, శారీరక కార్యకలాపాలు, వివిధ రకాల పుస్తకాలు చదవడం, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, పెయింటింగ్, మ్యాజిక్ తదితర వాటిని నేర్పిస్తున్నారు. ప్రముఖులతో అవగాహన సదస్సులు, ఆటలపై ఆసక్తి ఉన్నవారికి చెస్, క్యారమ్స్ వంటివి నేర్పిస్తున్నారు. ఆయా విభాగాల్లో పోటీలను పెట్టి విజేతలకు పుస్తకాలతో పాటు కవులు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత విశేషాల పాఠ్య పుస్తకాలు అందజేయనున్నారు.



మడకశిర గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న చిన్నారులు

వందల రకాల పుస్తకాలు

గ్రంథాలయంలో వందల రకాల అంశాలకు సంబంధించిన వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పోటీ పరీక్షలు, బాల సాహిత్యం, మనోవిజ్ఞాన శాస్త్రాలు, రామాయణం, భారతం, మాస, పత్రికలు తదితర అనేక రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచారు.



మడకశిర గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న వివిధ రకాల పుస్తకాలు

విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు

పేద విద్యార్థులకు స్వచ్ఛంద సేవ చేయాలనుకొనే వారికి ఇది మంచి అవకాశం. స్పోకన్ ఇంగ్లిష్ , చెస్, డ్రాయింగ్, తెలుగులో మంచి ప్రతిభ ఉన్న వారు ఈ గ్రంథాలయాల ద్వారా స్వచ్ఛంధంగా సేవలు అందించేందుకు గ్రంథాలయ సంస్థ అవకాశం కల్పించింది. వేసవిలో ఇలాంటి సేవ ద్వారా ఎంతో మంది విద్యార్థులకు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు ఆస్కారం ఉంటుంది.



– కెకె రావు, గ్రంథాలయ అధికారి, గుడిబండ

అన్ని విధాలా ఉపయోగం

వేసవి సెలవుల్లో విద్యార్థులకు గ్రంథలయాల్లో శిక్షణ శిబిరాలు గత ఏడాది విజయవంతంగా నిర్వహించాం. విద్యార్థులు అధికంగా సెల్ ఫోన్లకే సమయం కేటాయించి చిన్న వయసులోనే కళ్లజోళ్లతో కనిపిస్తున్నారు. గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లు విద్యార్థులకు అన్ని విధాలా ఉపయోగకరంగా ఉన్నాయి. విద్యార్థుల ఫోన్ నంబర్ సేకరించి నిత్యం శిక్షణకు వచ్చేలా చూడాలని సిబ్బందికి ఆదేశించాం.



– రమాదేవి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

27 నుంచి పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

హిందూపురం: పాలిటెక్నిక్ 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాలిటెక్నిక్ కోర్సు ప్రవేశాలకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసిందని స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ హరీష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకూ ధ్రువపత్రాల పరిశీలన, కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు జూన్ 2వ తేదీలోగా ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 31వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకూ ఆప్షన్ల నమోదుకు అవకాశం ఉంటుందన్నారు. జూలై 7వ తేదీన సీట్లు కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. జూన్ 10వ తేదీలోగా విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో సెల్ఫ్ జాయిన్ అయి కళాశాలలో రిపోర్టు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అదేరోజు నుంచే తరగతులు ప్రారంభం అవుతాయని ప్రిన్సిపాల్ తెలియజేశారు. మరిన్ని వివరాలకు స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించవచ్చన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం గర్భిణులకు డాక్టర్ నాగరాజునాయక్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అవసరమైన మందులను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లోని వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవాలు అందించాలని ఆదేశించారు.

జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయం

- ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

గుడిబండ/అగళి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప తెలిపారు. విశాఖపట్నంలో ఆయన సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తారన్నారు. అగళి మండలం మధూడి పంచాయతీ వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పను ఫళారం గ్రామంలో ఆయన ఇంటి వద్ద కలిశారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో సైనికుల్లా పనిచేసి వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్టీలో ప్రతి ఒక్క కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. మడకశిర నియోజకవర్గంపై వైఎస్సార్‌సీపీ జెండా మరోసారి రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హర్ష, శ్రీనివాస్, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్‌కు పరామర్శ

మడకశిర: వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పుట్టకామప్పను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే మడకశిర పట్టణంలో ఈనెల 13న జరిగిన పోలింగ్ సరళిని కూడా పట్టణ కన్వీనర్ ద్వారా ఈరలక్కప్ప అడిగి తెలుసుకున్నారు.



వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పను కలసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

డిప్లొమా ఇన్ ఫార్మసీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం: స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో రెండేళ్ల కాల పరిమితితో 2024–25 విద్యా సంవత్సరానికి డీ ఫార్మసీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.హరీష్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేశామని చెప్పారు. జూన్ 15వ తేదీ వరకూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ, ఓపెన్ ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణులైన విద్యార్థినులు, సీబీఎస్‌సీ, ఐఎస్‌సీఇ బోర్డు నుంచి సమానమైన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారందరూ అర్హులని పేర్కొన్నారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెల్లరేషన్ కార్డు కల్గిన ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు అడ్మిషన్ ఫీజు మినహాయింపు ఉంటుందని వివరించారు. అలాగే స్కాలర్‌షిప్ సౌకర్యం కూడా ఉంటుందన్నారు. అడ్మిషన్ పొందిన వారికి కళాశాల ప్రాంగణంలోనే హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల విద్యార్థినులు మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ (అర్హత కలిగిన ఓసి అభ్యర్థులకు) పాస్ పోర్టు సైజ్ ఫొటోతో పాటు అప్లికేషన్ రుసుం రూ.400తో హిందూపురం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 98662 73402, 9703843680 లను సంప్రదించాలని సూచించారు.

సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

లేపాక్షి: లేపాక్షిలోని మహాత్మాజ్యోతిభా పూలే గురుకుల పాఠశాలలో 10వ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయని ఎంఈఓ నాగరాజు తెలిపారు. మొదటిరోజు తెలుగు పరీక్షకు 117 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 72 మంది విద్యార్థులు హాజరు కాలేదన్నారు.

వైభవంగా ఊయలలోత్సవం



కాళికామాతకు ఉయ్యాలోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ప్రత్యేక అలంకరణలో కాళికాదేవి

పావగడ: వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని ఆఫ్ బండపై కొలువు తీరిన కాళికాదేవి అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు నరేశ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఊయలలోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ప్రాకారోత్సవం తర్వాత అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

కార్మికులకు బస్సు సౌకర్యం కల్పించాలి

హిందూపురం టౌన్: గార్మెంట్స్ పరిశ్రమలో పని నిమిత్తం వెళ్లే కార్మికులు తరచూ ఆటో ప్రమాదాలకు గురై వారి జీవితాలు బజారున పడుతున్నాయని, కార్మికులకు బస్సు సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని కార్మికశాఖ కార్యాలయంలో ఏఎల్‌ఓ శేఖర్‌బాబుకు నాయకులు వినతి పత్రం అందించారు. ఇటీవల చిలమత్తూరు మండలం కోడూరు తోపు వస్త్ర పరిశ్రమకు చెందిన కార్మికులు వడ్డిపల్లి వద్ద ఆటో బోల్తా పడి గాయాలపాలయ్యారన్నారు. కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. జిల్లా కార్మికశాఖ అధికారులు స్పందించి పరిశ్రమ యాజమాన్యం బస్సు సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, జిల్లా కోశాధికారి బాబు, తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షుడు రవికుమార్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి మారుతీరెడ్డి, ఉపాధ్యక్షుడు కమల్ బాషా, జిలాన్ పాల్గొన్నారు.



ఏఎస్‌ఓ శేఖర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూ నాయకులు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

హిందూపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీన లెక్కించనున్నారని, అంతవరకూ పెట్రోల్ బంకుల్లో లూజ్ పెట్రోల్ విక్రయాలు అమ్మకం నిషేధించినట్లు డీఎస్పీ కంజాక్షన్ తెలిపారు. ఎన్నికలు ఫలితాలు వెలువడే రోజు కూడా ఎక్కడా టపాసులు కాల్చకూడదన్కనారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఫలితాలు వెలువడిన తరువాత ఎలాంటి ఊరేగింపులకు అనుమతులు లేవన్నారు.

అపరిచిత వ్యక్తులకు ఆస్కారం ఇవ్వొద్దు

బిట్స్ కాలేజీ, లేపాక్షి సమీపంలోని గురుకుల పాఠశాలల్లో ఎన్నికల కౌంటింగ్ నిర్వహించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగానే పట్టణంలో ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. లాడ్జీలు, కళ్యాణ మంటపాలు, ఫంక్షన్ హాళ్లను తరచూ తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు.

రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని, కౌంటింగ్ సమయంలో ఆటంకం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ కంజాక్షన్ రాజకీయ నాయకులను హెచ్చరించారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. 144 సెక్షన్ అమల్లో ఉందని విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. సమావేశంలో వన్‌టౌన్, టూటౌన్ సీఐలు శ్రీనివాసులు, రియాజుద్దీన్ పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన డీఎస్పీ కంజాక్షన్

ఎన్నికల ఫలితాలపై పావగడలో జోరుగా బెట్టింగ్

పావగడ: కర్ణాటక సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక ఎన్నికల ఫలితాలపై పావగడలో జోరుగా బెట్టింగులు సాగుతున్నాయి. తాలూకాలోని క్యాతగానచెర్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు వైఎస్సార్‌సీపీ మరోసారి గెలిచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ఆంధ్ర సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారని రూ.35 లక్షల పందెం కాసినట్లు తెలిసింది. అదే విధంగా పట్టణంలోని ఓ మెడికల్ దుకాణం యజమాని టీడీపీ గెలిచి చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తాడని రూ.10 లక్షలు పందెం వేసినట్లు సమాచారం. అలాగే పట్టణంలోని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి సైతం వైఎస్సార్‌సీపీ గెలిచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా పదవీ బాధ్యతలు చేపడతాడని రూ 10 లక్షలు పందెం కాసినట్లు తెలియవచ్చింది. అలాగే తాలూకాలోని బుద్దారెడ్డిపల్లి, నీలమ్మనహళ్లి గ్రామాల్లో కూడా ఇరువర్గాలు లక్షలాది రూపాయలు బెట్టింగ్‌లు వేసినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉంటే పావగడ తాలూకా సమీప సరిహద్దులోని రాప్తాడు, మడకశిర, పెనుకొండ, కళ్యాణదుర్గం, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గాల ఫలితాలపై స్థానిక ప్రజలు ఎంతో ఆసక్తి చూపుతుండటం విశేషం.



పండ్ల తోటల పెంపకానికి చేయూత

పావగడ: తీవ్ర వర్షాభావంతో పంటలు పండక వెలవెల బోతున్న బీడు భూముల్లో పండ్ల తోటల పెంపకానికి చేదోడు వాదోడుగా నిలిచేందుకు ఆహ్వాన్ ఫౌండేషన్ సంస్థ ముందుకు వచ్చింది. తాలూకాలోని వెంకటాపురం గ్రామ సమీపంలోని ఓ ఆర్వో ప్లాంట్ ప్రాంగణంలో శుక్రవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఆహ్వాన్ ఫౌండేషన్ సీఈఓ బీరజ్ కిశోర్ ప్రధాన్ మాట్లాడుతూ తాలూకాలోని పేద రైతులకు చెందిన 2 ఎకరాల భూమిలో పండ్ల తోటల పెంపకానికి ఎల్‌అండ్‌టీ ఆర్థిక సహకారంతో దానిమ్మ, జామ, మామిడి తదితర వివిధ రకాల పండ్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. రెండేళ్ల పాటు వాటి పెంపకం ఖర్చులకు తామే భరిస్తామని చెప్పారు. అయితే రైతులు పండ్ల మొక్కల పెంపకంపై శ్రద్ధ చూపించాలన్నారు. అనంతరం వారు సమీపంలోని భూములను పరిశీలించారు. కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ ప్రతినిధులు సందీప్ శర్మ, ఆనంద్, లక్ష్మి, ఆహ్వాన్ సంస్థ మేనేజర్లు అర్చన, మురళి తదితరులు పాల్గొన్నారు.



భూములను పరిశీలిస్తున్న ఆహ్వాన్ బృందం

వైభవంగా 101 ప్రసాద వితరణ



అలంకరణలో రంగనాథస్వామి

రొళ్ల: మండల పరిధిలోని కాల్వేపల్లి గ్రామంలో వెలసిన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వైభవంగా వసంతోత్సవం పూజ కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వేకువజామున స్వామివారి మూల విగ్రహాన్ని గంగా జలంలో శుద్ధి చేసి అభిషేకించారు. అనంతరం మూల విగ్రహంతో పాటు ఉత్సవ విగ్రహాన్ని వెండి కవచం, భక్తులు కానుక రూపంలో తీసుకువచ్చిన పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో పాటు పూలతో విశేషంగా అలంకరణ చేసి మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం భక్తులు సమర్పించిన వడి బియ్యం, బెల్లం, బ్యాళ్లతో ప్రత్యేకంగా 101 ప్రసాదాలను తయారు చేసి ఆలయ ఆవరణలో భూతప్ప స్వాముల విగ్రహాల ఎదుట నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. అనంతరం ప్రసాదాన్ని భక్తులకు పంచి పెట్టారు. ప్రసాదం కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతుండడంతో స్వామివారిని కొలిచే చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి దర్శించుకుంటున్నారు. కమిటీ ద్వారా భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ఆవరణలో 101 ప్రసాదానికి పూజలు చేస్తున్న అర్చకులు